కావడం అదంతానూ. "ఇంతకీ సనత్‌నగర్‌లో ఒక బోర్డు సంస్కరణ కేసు ఉందా ఏమిటి; నాకెపుడూ కనబడలేదే?" అన్నాడు.

"ఉంది. అది కూడా నయాగరాకి సంబంధించినదే. ఎటొచ్చీ ఇంగ్లీషులో నయాగరా అని రాసి తెలుగులో "నయగార" అని రాసేరు" అని అతన్ని అక్కడికి తీసుకెళ్ళి చూపించేను.

"నయగార అనేది తెలుగులో మంచి శబ్దం. అంచేత ఈ తెలుగురాత ఇలాగే వుంచి ఇంగ్లీషుదే మార్పించేస్తే సరి!" అని ఆ ప్రయత్నంలో పడ్డాడు బాషా.

అక్కణ్ణించి బాషా నన్ను తన ఇంటికి తీసుకెళ్లాడు. "అయేషా!" అని పిలిచాడు. రాగానే "నా ఆవిడ!" అన్నాడు.

"మా ఆవిడ - అనేదే రైటు. గొప్పవాళ్లు. సంస్కారులూ, అందరూ "మా ఆవిడ" అనే అంటారు. ఆఖరికి శ్రీకాకుళం జిల్లాలోని పేద వ్యవసాయ కార్మికుడు కూడా "మాయాడది" అనీ, "మా ఆడమనిషి" అనీ అంటాడు. స్త్రీలు కూడా "మా ఆయన" అని, "మా వారు" అనీ అంటారు తప్పా - నా ఆయన - అనరు"

అని నేను బాషాకి వివరించి అతని భాషని సంస్కరించ దలచుకోలేదు. అయేషా అనే స్త్రీ "అతని-ఆవిడ" అన్నది నిజం; ఆ ప్రయోగం వినోదాత్మకంగా ఉన్నాసరే.

★

# 57. గాభరా, గో!

"నువ్వు రోజూ ఆఫీసుకి లేటుగా వస్తున్నావనీ, సెక్యూరిటీ గేటు దగ్గిర డ్యూటీలో ఉండేవాళ్లని కబుర్లలో పెట్టి సరైన టైమ్‌కే వస్తున్నట్టు నోట్ చేస్తున్నావనీ బాస్‌కి తెలిసినట్టుంది. కొన్నాళ్లపాటు నీ రాకపోకల వేళలమీద నిఘా ఉంచమని నిన్న చెపుతూంటే నా చెవిని పడింది" అని మా డిప్యూటీ మేనేజర్ నిన్న సాయంకాలం నాతో గుట్టుగా చెప్పేడు.

ఇవాళ ఇంటి దగ్గర్నుంచీ సిటీబస్సు స్టేజి దగ్గరికి వెళ్లేలోగా ఈ మాటలు రకరకాల క్రియా విపరిమాణాలతో అన్వయ సంక్లిష్టతలతో తలలో మెదులుతూ వుంటే ఆ ఆందోళనలో ఇలా వచ్చి అలా బయలుదేరిన బస్సులో ఇతరుల్నెవర్నీ గమనించకుండా ఎక్కేశాను.

నిలబడ్డానికి మాత్రం స్థలం దొరికింది.

బస్సులోపల నిలబడవలసి వచ్చినా బస్సుకోసం నిలబడే అవసరం రాలేదు కదా అని తృప్తి పడుతూ చేతివాటు దూరంలో ఉన్న పట్టీ లాక్కుని సెటిలయ్యాను.

"గాభరాగో - అని పెట్టుకోవలసింది, నీ పేరు!" అని వెనకనించి ఓ రిమార్కు వినిపిస్తే స్పందించి అటు చూసేను. ముకుందరావు నన్నుచూసి నవ్వుతూ కనబడ్డాడు.

"ఎప్పుడు రావటం?" అని పలకరించేను.

"ఈ ఉదయమే గోదావరిలో దిగేను" అన్నాడు.



B

"నయమే. నిన్నరాత్రి క్రిష్ణలో దిగేవుకాదు" అని నోటికొచ్చిన జోక్ వేసేను.

వెనకెప్పుడో ఓసారి ఈ ముకుందరావు విశాఖపట్నం వెళుతూవుంటే లేటుఫీ అంటించిన ఉత్తరం ఒకటి అతని చేతికిస్తూ గోదావరిలో పడేమని చెప్తే "అంటే నేను రాజమండ్రి దాకా మేలుకొని కూచోవాలనా; నీ ఉద్దేశం?" అన్నాడు.

"నీకు పుణ్యం ఉంటుంది. ఉత్తరం తొందరగా వెళ్లాలి. గౌతమిలోనో, ఈస్టుకోస్టులోనో పడెయ్యకు. గోదావరి ఎక్స్‌ప్రెస్సులో పోస్టు తీసికెళ్లే కంపార్టుమెంటు ఉంటుంది" అని బోధపరచకపోతే ఏం చేసేవాడో.

"అన్నట్టు నువ్విప్పుడెక్కడ పనిచేస్తున్నావూ?" అని అడిగేడు.

చెప్పేను.

"ఇహనేంమరీ! నేనూ మీ ఆఫీసుకే" అన్నాడు. సరిగా అదే సమయానికి తరవాతి స్టాపువచ్చి బస్సు ఆగింది. అతనికి ఆ చివరా, నాకు ఈ చివరా కూర్చోవడానికి జాగాలు దొరికేయి. అంచేత "మా ఆఫీసుకి రావడానికి నీకేంపని తగిలింది?" అని అడగడం పడింది కాదు.

బస్సు మా ఆఫీసు సమీపంలో స్టాపు దగ్గిర ఆగినప్పుడు ఇద్దరం దిగేం కానీ; టిక్కెట్టు వెనకాల కండక్టరు పెన్సిల్‌తో రాసిన చిల్లర వొసూలు చేసుకునే సందట్లో ముకుందరావు ఉండిపోడంతో "అదుగో, అదే మా ఆఫీసు. నేను లేటు మార్కు పడకుండా వెళ్లాలి!" అని జోరుగా నడిచేశాను.

సెక్యూరిటీ గేటు దగ్గిర నా టైమ్ నోట్ చేయించి "నాకోసం ముకుందరావు అనే అతను వస్తాడు. లోపలికి పంపండి" అని చెప్పేసి సీట్‌లోకి వెళ్లిపోయాను.

పది నిమిషాలు దాటినా ముకుందరావు నా దగ్గిరికి రాకపోడంతో మళ్లీ గాభరాపడి; కారిడార్‌లోకి వచ్చేను. ముకుందరావు వెయిటింగు లాబీలో కూర్చుని కనిపించేడు. మా ఎకౌంట్స్ డిపార్టుమెంటు ప్యూను అతనికి దగ్గిరగా వెళ్లి "ఇంకా రాలేదుసార్" అని చెప్పేడు.

ఎకౌంట్స్ జి.ఎం. గారిదీ ముకుందరావుదీ ఇంటిపేరు ఒకటేనని అప్పుడు గుర్తొచ్చింది.

అంత గొప్పవారిని చూడ్డానికొచ్చిన మనిషి నా సీటు దగ్గిర ఎందుకు కూచుంటాడులే అని రాజీపడి; 'నీపని అయిపోయాక నా దగ్గిరకొచ్చి కాసేపు కూచుని వెళ్లు. కబుర్లు చెప్పుకుందాం. నేను పెర్సనల్ డిపార్టుమెంట్‌లో ఉన్నాను. వేరే గది ఇచ్చేరు. తలుపు మీద నాపేరు ఉంటుంది' అని చెప్పేను. ముకుందరావు లేచి నిలబడి గాభరాగా "అలాగే, అలాగే!" అన్నాడు.

"ఆయనొచ్చేదాకా కూడా నా రూమ్‌లో కూర్చోవచ్చు. కావాలంటే, ఈలోగా కొంచెం టీ తాగొచ్చు. రూముకి వస్తుంది" అన్నాను.

"అబ్బే! అబ్బే! ఒద్దొద్దు. నేను వస్తానుగా" అన్నాడు ముకుందరావు; ఇంకా గాభరా తగ్గని ధోరణిలో.

నేను నా రూమ్‌కి వచ్చేశాను.

"ఏమిటి పని?" అన్నాను.

"అబ్బే, ఏం లేదు, వూరికినే," అని నా టేబిలు మీదున్న సరంజామా అంతా పరీక్షగా

చూస్తూ కూర్చున్నాడు. అన్నిటినీ మెచ్చుకుంటూ, కొన్నిటిని చూసి ఆశ్చర్యం ప్రకటిస్తూ వివాదం రాకుండా పొడిపొడిగా సంభాషణ నడిపేడు.

మరో పది నిమిషాలైంది. టీ కప్పులు పట్టుకుపోవడానికి "బోయ్" వస్తే "కాళీకృష్ణ వచ్చేరేమో కనుక్కుని రమ్మంటావా?'' అని నన్నూ బోయ్‌ని మార్చిమార్చి చూసేడు.

"ఒచ్చేరు సార్.'' అన్నాడు బోయ్.

ముకుందరావు లేచేడు.

"కూర్చో!'' అని ముకుందరావుకి చెప్పి, "నేను రమ్మంటున్నానని కాళీకృష్ణకి చెప్పు'' అని బోయ్‌కి చెప్పేను. వాడు వెళ్లేడు.

"అయ్యో, నీకెందుకూ శ్రమ? నేను వెళ్లి మాట్లాడుదును కదా!'' అని ముకుందరావు మళ్లీ గాభరా పడ్డాడు.

తలుపు తెరుచుకుంది. ఎకౌంట్స్‌లో జూనియర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కాళీకృష్ణ "నమస్కారం సార్'' అని వచ్చి కూర్చుంది. ముకుందరావు ఆమెని ఒకసారి చూసి, మొహమాటంగా మొహం అటుతిప్పుకుని కూర్చున్నాడు.

"ఎప్పుడూ లేంది, ఈ మధ్య మనవాళ్లకి టైమ్‌సెన్సు పట్టుకుంది. ఆఫీసులో ఎవరు ఎంత శ్రద్ధగా పనిచేస్తున్నారని కాక ఎవరు ఎన్నిగంటల ఎన్ని నిమిషాలకి వస్తున్నారు. పోతున్నారు - అన్నదానిమీద శ్రద్ధ ఎక్కువైంది!'' అంది కాళీకృష్ణ.

"నీదాకా ఎందుకు, నామీదనే నిఘా పెట్టేరు!'' అన్నాను.

"అవునా!''

"ఇతను మా ఫ్రెండు ముకుందరావు. వీళ్లదీ విశాఖపట్నమే, నీతో ఏదో మాట్లాడదామని వచ్చేడు.'' అన్నాను.

ముకుందరావు "అబ్బే, అబ్బే!'' అని మళ్లీ గాభరా పడ్డాడు.

"ఈవిడే కాళీకృష్ణ, ఏదో మాట్లాడాలన్నావు కదా?'' అన్నాను.

"అదికాదు, కాళీకృష్ణ అంటేనూ -''

"ఆ! కాళీకృష్ణే! మా ఎకౌంట్సులో జూనియర్ ఆఫీసరు'' అన్నాను.

"అయాంసారీ...'' అని ముకుందరావు జేబులోంచి ఒక కాగితం తీసి, శ్రద్ధగా చదువుకోడం మొదలెట్టేడు.

కాళీకృష్ణ ఆ కాగితం మీదికి వంగిచూసి పడీపడీ నవ్వడం మొదలెట్టింది. "సార్, ఇది ఎనిమిదో కేసు! వస్తాను.'' అని లేచింది. "పాపం, వైజాగ్ నుండి వచ్చేరా? సారీ అండీ'' అని, చిలిపిగా నవ్వుకుంటూ వెళ్లిపోయింది.

"మీ ఆఫీసులో ఇంకో కాళీకృష్ణ ఎవరైనా ఉన్నారా? అదే, కాళీకృష్ణ అనే అబ్బాయి లేడా?'

"లేడే! ఎందుకు?'' అంటూనే అతనిచేతిలో ఉన్న కాగితం అందుకున్నాను.

అది ఓ పెళ్లి సంబంధాల లిస్టు. సీరియల్ నెంబరు. పురుషుడా, స్త్రీయా, వయసు, ఎత్తు, ఉద్యోగం, జీతం, తండ్రి పేరు, గోత్రం, వారికి కావలసినది ఏమిటి - ఇలా పట్టీకరణం

(టేబ్యులేషను) చేసి వున్నాయి. అందులో కాళీకృష్ణ - 29 - 5అ. 5అం. జూనియర్ ఆఫీసర్, ఎకౌంట్సు - 3200, వగైరా అన్నీ ఉన్నాయి.

"అబ్బాయి అనుకుని మీ శారదకి సరిపోతాడు అని చూసుకోడానికొచ్చేవన్నమాట!" అన్నాను, కాగితం ఇచ్చేస్తూ.

"అంటే - ఈ ఒక్కపనిమీదే కాదనుకో. కాని, వివరాలు చూస్తే కాళీకృష్ణ అబ్బాయి అనుకోడంలో నా పొరపాటేమైనా ఉందంటావా?" అని కాగితం మళ్లీ నాకు ఇచ్చేడు.

పురుషుడా, స్త్రీయా అని ఉన్న కోలమ్‌లో 'పు' అనిగాని 'స్త్రీ' అనిగాని అచ్చుపడలేదు. నాలుగు లైన్లకి పైన 'పు' అని ఉంది. అక్కణ్ణించి డిటోకి ఉపయోగించే చిహ్నం వుంది.

కాళీకృష్ణ మళ్లీ వచ్చింది. నాలుగు ఉత్తరాలు చూపించింది. "ఇవికాక మూడు టెలిఫోను కాల్సు వచ్చేయి సార్" అంది, కాసేపు నవ్వుకుని "మరుసటి సంచికలో సవరణ వేయించాలి" అని నిర్ణయించుకున్నాను.

"అదికాదూ, నాతో ముందే ఎందుకు చెప్పలేదు?" అన్నాను ముకుందరావుతో.

"ఏం చేయను! నీకూ పెళ్లికావల్సిన కూతురు ఉంది కదా. నువ్వెక్కడ తన్నుకుపోతావో అని గాభరాలో పడ్డట్టున్నాను..." అన్నాడు ముకుందరావు. ★

# 58. స్పెషల్ ప్రయాణం

**బా**గా ముందుగానే నిర్ణయం అయినప్పటికీ మొన్న ఐదో తారీఖునాడు నేను హైదరాబాద్ నుండి విశాఖపట్నం రావడానికి గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో ఖాళీ దొరక్క; "సమ్మర్ స్పెషల్" అనే ప్రత్యేక రైల్లో మాత్రం రిజర్వేషన్ దొరికింది. స్పెషల్ ట్రెయిన్లూ స్పెషల్ విమానాలూ ఎవరో గొప్పవాళ్లకి మాత్రం వేస్తారు కదా; ఈ ప్రయాణంలో సామాన్యులందరికీ వి.ఐ.పి. ట్రీట్‌మెంటు దొరుకుతుంది కదా అనిపించి సరదాపడ్డాను.

ఈ స్పెషల్ ట్రెయిన్లు వేసవి రద్దీని తట్టుకోడానికి వేసేరుట. సికింద్రాబాదులో ప్రతి మంగళవారం శుక్రవారమూ బయలుదేరుతాయట. రోజూ ఉంటే అది స్పెషల్ ట్రెయిను ఎందుకవుతుంది?

దీని రూటూ రేటూ కూడా స్పెషలే. గోదావరి ఎక్స్‌ప్రెస్సు, ఈస్టుకోస్టు, కోణార్క్‌లాంటి ఆర్డినరీ బళ్లు కాజీపేట, విజయవాడ, ఏలూరు, సామర్లకోట రూట్లో వస్తాయి కానీ ఈ స్పెషల్ ట్రెయిన్ నడికుడి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, భీమవరం, నిడదవోలు, సామర్లకోట ద్వారా ఒక స్పెషల్ రూట్‌లో వస్తుందిట. కొంచెం చుట్టుదారే అయినా మన రాష్ట్రంలో మనం ఎప్పుడో కాని చూడని స్టేషన్లు చూడగలగడం ఒక స్పెషాలిటీ. మాములు రూటు 709 కిలోమీటర్లయితే ఇది 775 కిలోమీటర్లుట. ఇందులో మళ్లాను, సికింద్రాబాదు నుంచి నడికుడి ద్వారా గుంటూరికి ఉన్న దూరానికి మరో సగం కిలోమీటర్లు కలిపి అలా పెరిగిన దూరానికి ఛార్జీ వసూలు చేసేరుట. అంటే, మాములు రూటుకన్నా తక్కువే ఉన్నా ఎక్కువ ఉన్నట్టు రాసుకుని రేటుకూడా తదనుగుణంగా పెంచేరుట. అంతటితో సరిపెట్టక; ఎక్కువ డబ్బు